సాక్షి
విశాఖపట్నం
గురువారం । 30 । మే । 2024


కౌంటింగ్ ఏజెంట్లే కీలకం! 8లో


రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికలు 8లో


ఆలస్యంగా రైళ్ల రాకపోకలు 8లో

న్యూస్‌రీల్

అప్పన్న హుండీ ఆదాయం రూ.3.56 కోట్లు

28 రోజులకు రికార్డు స్థాయిలో ఆదాయం


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. గత 28 రోజులకుగాను రూ.3 కోట్ల 56 లక్షల 22వేల 149 వచ్చినట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం చరిత్రలో 28 రోజుల్లో ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం రావడం ఇదే తొలిశారని పేర్కొన్నారు. నగదుతో పాటు 142.100 గ్రాముల బంగారం, 28.440 కిలోల వెండి లభించినట్లు తెలిపారు. రోజుకు సరాసరి రూ.12 లక్షల 28వేల 350 హుండీ ఆదాయం లభించిందన్నారు. హుండీల ఆదాయాన్ని మంగళ, బుధవారాల్లో లెక్కించారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్


సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

మురళీనగర్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి బుధవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌కు అత్యధిక సంఖ్యలో విద్యార్థులు తమ సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. గైస్‌లో 27,001-35,000, కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో 35,001-43,000, పెందుర్తిలో 27,001-43,000 ర్యాంకుల వరకు కౌన్సెలింగ్ నిర్వహించగా.. మొత్తం 681 మంది హాజరయ్యారు. వీరిలో 419 మంది బాలురు, 262 మంది బాలికలు ఉన్నారు. కంచరపాలెం గైస్‌లో 302 మంది, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 290 మంది, పెందుర్తి పాలిటెక్నిక్‌లో 89 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. కంచరపాలెం పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు, గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, పెందుర్తి పాలిటెక్నిక్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఎండ తీవ్రత, ఉక్కపోతతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. గురువారం గైస్‌లో 43,001-51,000, కంచరపాలెం పాలిటెక్నిక్‌లో 51,001-59,000, పెందుర్తిలో 43,001-59,000 ర్యాంకుల విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. అభ్యర్థులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోగా హాజరుకావాల్సి ఉంది. ఎస్టీ విద్యార్థులు కంచరపాలెం పాలిటెక్నిక్‌కు హాజరుకావాలని ప్రిన్సిపాల్ నారాయణరావు సూచించారు.

రేపు పలాస-విశాఖ పాసింజర్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధి నౌపడ-పూండి సెక్షన్ మధ్య మెయిన్‌లైన్‌లో బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ కారణంగా ఈ నెల 31న పలాస-విశాఖపట్నం-పలాస(07471/07470) పాసింజర్ స్పెషల్‌ను రద్దు చేశారు. ఈ నెల 31, జూన్ 3వ తేదీల్లో విశాఖపట్నం-రాయ్‌పూర్ (08528) పాసింజర్ స్పెషల్ సెక్షన్ పరిధిలో 30 నిమిషాలు, 45 నిమిషాలు నియంత్రిస్తారు.

31న ఏపీజీఈఏ రౌండ్ టేబుల్ సమావేశం

మద్దిలపాలెం: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 31న విశాఖలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ కె.ఆర్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరగనుందన్నారు. జిల్లా పరిషత్ ఎదురుగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ పక్కన గల విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో ఆ రోజు సాయంత్రం 4 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రధానంగా సీపీఎస్, జీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ, 12వ పీఆర్సీ సత్వర అమలు, డీఏల చెల్లింపు తదితర అంశాలు చర్చిస్తామన్నారు.

బి.ఫార్మసీ పరీక్ష ఫలితాల విడుదల

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో బి ఫార్మసీ ఐదో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేశారు. మార్చి నెలలో జరిగిన ఐదో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచారు.

దారి చూపుతున్న ట్యాబ్

ఈ అంధ విద్యార్థి పేరు ఎం.రాకేష్‌బాబు. రావికమతం మండలం కొత్తకోట గ్రామం. స్థానిక భవిత కేంద్రంలో 7వ తరగతి చదువుతున్నాడు. ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లతో గూగుల్ లుక్ అవుట్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లు పంపిణీ చేయడం తనకెంతో ఉపకరించిందని చెబుతున్నాడు. గతంలో తాను ఎక్కడికైనా వెళ్లాలంటే స్టిక్ పట్టుకొని మరొకరి సహాయంతో వెళ్లేవాడినని, ఇప్పుడు ఈ ట్యాబ్ సహాయంతో తన ముందు ఏముందో ఇట్టే తెలుసుకోగలుగుతున్నానని తెలిపాడు. ట్యాబ్ ఆన్ చేస్తే చాలు అక్కడ ఏయే వస్తువులు ఉన్నాయో, ఎంత దూరంలో ఉన్నాయో వాయిస్ రూపంలో తనకు వినిపిస్తుందని వివరించాడు. తర్ఫీదు తీసుకున్నాక తమ బాబు ఇప్పుడు కళ్లున్నవారిలాగే చుట్టూ ఏముందో తెలుసుకోగలుగుతున్నాడని, చకచకా నడుస్తున్నాడని అతని తల్లిదండ్రులు ఆనందబాష్పాలు రాలుస్తూ చెప్పారు. ఇదంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలవేనని, ఇలాంటి రోజు వస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు.


ట్యాబ్‌లోని గూగుల్ లుక్‌అవుట్ యాప్ సహాయంతో తన ఎదురుగా ఉన్న వస్తువులను తెలుసుకుంటున్న రాకేష్‌బాబు

భవిత కేంద్రంలో చదువు.. స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం



ఈ యువకుడి పేరు బొండా చందు. పరవాడ మండలం స్వయంభూవరం గ్రామానికి చెందిన ఇతనికి పుట్టినప్పటి నుంచి వినికిడి లోపం ఉండేది. పరవాడ భవిత కేంద్రంలోని ప్రత్యేక ఉపాధ్యాయులు అతనిని గుర్తించి జాయిన్ చేసుకుని వినికిడి మిషన్ అందించారు. దాంతో టీచర్లు చెప్పే పాఠాలు వినబడేవి. ఆటపాటలతో అక్కడ చదువు బాగా నేర్పించారు. 2019లో పది పాసైన చందు ఐటీఐ చేసి ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్‌లో ట్రెయినీగా పనిచేస్తున్నాడు. ఉపాధ్యాయులు కుమారి, శ్రీనివాసులు తనను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారని చెప్పారు.

బంగారు 'భవిత'

- ప్రత్యేక అవసరాల పిల్లలపై ఫోకస్
- వాస్తవికత కోసం సమగ్ర సర్వే
- విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా కార్యక్రమాలు
- కేంద్రాల్లో ఆటపాటలతో చదువులు
- ఇళ్ల వద్దనే ఫిజియోథెరపీ సేవలు

జిల్లాలో భవిత కేంద్రాలు	11
ప్రత్యేక అవసరాల పిల్లలు	1,596
కేంద్రాలకు వచ్చే వారు	220
ఇళ్ల వద్దనే సేవలు పొందే వారు	110
ప్రస్తుత సర్వేలో లెక్క తేలినివారు	220
పనిచేస్తున్న ఐఈఆర్పీలు	22
ఆయాలు	11


గాజువాకలో సర్వే చేస్తున్న ఐఈఆర్పీ


భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలు అందిస్తున్న ఫిజియోథెరపిస్ట్

విశాఖ విద్య: భవిత కేంద్రాలు బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రత్యేక అవసరాల పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పి, వారి భవిష్యత్‌కు భరోసా కల్పించాలనే ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు రంగంలోకి దిగారు. అసలు ప్రత్యేక అవసరాలు పిల్లలు ఎంతమంది ఉన్నారనేది లెక్క తీసేందుకు ప్రస్తుతం సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారు. పాఠశాల యు-డైస్ కోడ్‌లో నమోదైన గణాంకాలతో సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది ఇంటింటా జల్లెడ పడుతున్నారు. ప్రభుత్వ రికార్డుల్లో నమోదు కాకుండా మిగిలిపోయిన వందలాది మంది ప్రత్యేక అవసరాల పిల్లలు ప్రస్తుత చేస్తున్న సర్వే ద్వారా వెలుగులోకి వస్తున్నారు. దీంతో ప్రత్యేక అవసరాల పిల్లల వాస్తవికత లెక్క తేల్చేలా ఇంటింటా సర్వేను జూన్ 9 వరకు కొనసాగించాలని విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. డీఈవో ఎల్. చంద్రకళ ఈ సర్వేను పర్యవేక్షిస్తున్నారు.


సర్వేలో గుర్తించిన వారికి ప్రవేశం కల్పిస్తున్న సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది

ఖాళీల భర్తీతో మెరుగైన సేవలు

ప్రతీ భవిత కేంద్రంలో ఇద్దరు ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్(ఐఈఆర్పీ)లు అందుబాటులో ఉన్నారు. గతంలో ఈ కేంద్రాల్లో ఐఈఆర్పీలు పూర్తి స్థాయిలో లేని పరిస్థితులు ఉండేవి. ఖాళీల భర్తీపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 37 ఐఈఆర్పీలను నియమించింది. సేవలు పొందే విద్యార్థుల తల్లుల్లోంచి ప్రతీ కేంద్రంలో ఒకరిని ఆయాగా నియమించారు. వీరికి నెలకు రూ.6 వేల పారితోషకాన్ని చెల్లిస్తున్నారు.

ఫిజియోథెరపిస్టుల నియామకం

శారీరక వైకల్యం ఉన్న వారు ఎక్కువగా ఉన్నందున, వీరికి అవసరమైన వైద్య సేవలు అందించేలా ప్రతీ మూడు మండలాలకు ఒక ఫిజియోథెరపిస్టును నియమించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించగా.. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నియామక పత్రాలు అందజేసి, సేవలు విస్తృతం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు.

హైస్కూళ్లలో విలీనంపై కసరత్తు

భవిత కేంద్రాలు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తున్నాయి. 3 నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు ఆటపాటలతో కేంద్రాల్లో చదువులు అందిస్తున్నారు. సాంకేతికతను జోడించి చదువులు చెప్పేలా హైస్కూల్ స్థాయి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. అయితే ప్రతీ కేంద్రంలో 20 మందికి మాత్రమే అవకాశం ఉంది. మిగతా వారిని సమీప హైస్కూళ్లకు పంపిస్తున్నారు. నడవలేని స్థితిలో ఉన్న వారికి ఇళ్ల వద్దనే సేవలు అందిస్తున్నారు. వీరి ప్రాధాన్యత దృష్ట్యా భవిత కేంద్రాలను మరింత బలోపేతం చేసే దిశగా అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా హైస్కూళ్ల ప్రాంగణానికి సమీపంలో నిర్వహిస్తున్న కేంద్రాలను వాటిలో విలీనం చేసేలా కసరత్తు చేస్తున్నారు.

సర్వేపై ప్రత్యేక శ్రద్ధ

ప్రత్యేక అవసరాల పిల్లలందరినీ గుర్తించేలా ప్రస్తుతం ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సర్వేలో గుర్తించిన వారికి వెంటనే సమీప ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నాం. ఏ రోజుకారోజు సర్వే నివేదికలను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం.

– బి.గీత, సహిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్


నమ్మివానిపేటలో ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్న ఎంఈవో శివరాణి, ఐఈఆర్పీ కెజియా కుమారి

43 మంది ప్రత్యేక బాలల గుర్తింపు

తగరపువలస: భీమిలి మండలంలో బడి బయట ఉన్న 43 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్టు ఎంఈవో శివరాణి తెలిపారు. జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేట, వలందపేట గ్రామాల్లో బుధవారం నలుగురు ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్టు ఆమె వివరించారు. జూన్ 9 వరకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా బడి బయట ఉన్న 0-18 ఏళ్ల ప్రత్యేక అవసరాల చిన్నారులను గుర్తించనున్నామన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను పాఠశాలల్లో చేర్పించి, తద్వారా భవిత స్కూల్‌కు పంపించాలని సూచిస్తామన్నారు. మానసిక వైకల్యం, మూగ, చెవుడు, కళ్లు కనిపించని, చలన వైకల్యం ఉన్న చిన్నారులను దగ్గరలోని పాఠశాలల్లో చేర్పించాలన్నారు. భవిత స్కూల్ ఐఈఆర్పీ కెజియా కుమారి తదితరులు పాల్గొన్నారు.

లక్ష పెండింగ్ కార్డులకు మోక్షం!

- ఇప్పటికే 60 వేల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డుల జారీ
- త్వరలో మరో 40 వేల పంపిణీకి సన్నాహాలు
- ఇకపై అందుబాటులోకి డిజి లాక్ సదుపాయం
- దీంతో ప్రస్తుత కార్డులకు మంగళం



డ్రైవింగ్ లైసెన్స్ స్మార్ట్ కార్డులు

సాక్షి, విశాఖపట్నం : చాన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న డ్రైవింగ్ లైసెన్సులు, ఆర్సీ (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్) కార్డులకు మోక్షం కలుగుతోంది. కొన్నాళ్ల నుంచి చిప్‌తో కూడిన స్మార్ట్ కార్డుల జారీ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. 2022 ఆగస్టు నుంచి కార్డుల కొరతతో వీటి జారీ నిలిచిపోయింది. ఇలా విశాఖపట్నం జిల్లాలో 2022 ఆగస్టుకు ముందు వరకు జారీ చేయాల్సిన కార్డులు దాదాపు లక్ష వరకు పెండింగ్‌లో ఉన్నాయి. పాత వాటికి కొత్తగా ఇస్తున్న ఈ స్మార్ట్ కార్డులను ఇప్పటిదాకా 60 వేల వరకు సంబంధిత వ్యక్తులకు/వాహన యజమానుల చిరునామాకు పోస్టల్ ద్వారా పంపించారు. మిగిలిన 40 వేల కార్డులను కూడా పంపిణీ చేయడానికి రవాణా శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇన్నాళ్లూ ఈ కార్డుల కోసం ఎదురు చూస్తున్న వారికి ఊరట కలుగుతోంది. మరోవైపు నేషనల్ ఇన్ఫర్మేటివ్ సెంటర్ (ఎన్ఐసీ) వాహనాల ఆర్సీల కోసం వాహన్ డాట్ పరివాహన్ డాట్ జీవోవీ డాట్ ఇన్, డ్రైవింగ్ లైసెన్సుల జారీకి సారథి డాట్ పరివాహన్ డాట్ జీవోవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌ను అందుబాటులో ఉంచింది. ఇకపై నేరుగా సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి అవసరమైన డ్రైవింగ్ లైసెన్స్/ఆర్సీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వీలు కల్పించింది. దీని వల్ల మునుపటిలా రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ పదే పదే తిరగాల్సిన అవసరం ఉండదన్న మాట! పైగా అన్నీ సవ్యంగా ఉంటే నిర్ణీత సమయంలోనే ఇవి జారీ అవుతాయి. వీటికి డిజి లాక్ సదుపాయం ఉంటుంది. ఫలితంగా ప్రస్తుతం ఉన్న, ఇస్తున్న కార్డుల స్థానంలో పీడీఎఫ్ కార్డులు జారీ అవుతాయి. అంతేకాదు.. దరఖాస్తుదారుడు పేపర్ పీడీఎఫ్, స్మార్ట్ కార్డులు రెండూ పొందవచ్చు. లేదంటే ఏది కావాలంటే దానినే తీసుకోవచ్చు. ప్రస్తుతం ఈ-ప్రగతిలో పాత లైసెన్స్/ఆర్సీల వివరాలు తెలుసుకునేందుకు కేవలం రవాణా శాఖ సిబ్బందికి మాత్రమే అవకాశం ఉంది. ఇలా వాహనదారులు, డ్రైవర్లకు అనువైన సదుపాయాలు పొందే వీలు కలుగుతోంది.

దళారులను నమ్మి మోసపోవద్దు

విశాఖ సిటీ: విద్యుత్ శాఖలో ఉద్యోగాలిప్పిస్తామని నకిలీ నియామక పత్రాలను అందిస్తున్న మోసగాళ్లను నిరుద్యోగులు నమ్మొద్దని ఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) ఎం.రామకృష్ణ ఓ ప్రకటనలో సూచించారు. ఏపీఈపీడీసీఎల్‌లో ప్రస్తుతం ఎటువంటి నియామక ప్రక్రియ చేపట్టడం లేదని తేల్చి చెప్పారు. ఉద్యోగ నియామకాలు చేపడితే ఉద్యోగ ప్రకటన సంస్థ వెబ్‌సైట్, ప్రముఖ తెలుగు, ఆంగ్ల దిన పత్రికల్లో ప్రకటనలు ఇస్తామన్నారు. ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా పారదర్శకంగా నియామకాలు చేపడతామన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికపై సబ్ స్టేషన్లను నిర్వహించేందుకు కాంట్రాక్టర్లతో సంస్థ ఒప్పందం కుదుర్చుకుంటోందని, అందులో పనిచేసే సిబ్బందితో కానీ, వారి నియామక ప్రక్రియతో కానీ ఏపీఈపీడీసీఎల్‌కు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. సంస్థ పేరుతో నియామక పత్రాలు అందించేందుకు కాంట్రాక్టర్లకు కూడా అనుమతి లేదన్నారు. అయినప్పటికీ నిరుద్యోగులకు విద్యుత్ సబ్ స్టేషన్లలో కాంట్రాక్టు ప్రాతిపదికపై పనిచేసే షిఫ్ట్ ఆపరేటర్ పోస్టులకు నకిలీ నియామక పత్రాలు ఇచ్చి మోసగిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇటువంటి నకిలీ నియామకాలను నమ్మి మోసపోవద్దన్నారు. ఏపీఈపీడీసీఎల్‌లో ఉద్యోగ నియామకాల కోసం www. apeasternpower.com వెబ్‌సైట్‌లో గానీ, ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు.

ఏపీ ఎన్నికల కమిషన్ తీరు బాధాకరం

సాక్షి, విశాఖపట్నం: పోస్టల్ బ్యాలెట్ల విషయంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం కేంద్ర ఎన్నికల కమిషన్ నిబంధనలకు తూట్లు పొడిచినట్లు ఉందని మాజీ వీసీ లజపతిరాయ్ అన్నారు. రాష్ట్ర ఈసీ తీసుకున్న ఏకపక్ష నిర్ణయం.. కౌంటింగ్ సమయంలో అల్లర్లు సృష్టించే విధంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మార్చి 19న కేంద్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఎన్నికల నియమావళి కాదని, రాష్ట్రంలో కొత్త నిబంధనలను ఎలా తీసుకొస్తారని ప్రశ్నించారు. ఏపీ ఎన్నికల కమిషన్ ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసీ నిర్ణయం అనేక మంది అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపనుందని, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా హైకోర్టు సూచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దేశ చరిత్రలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరు విస్మయానికి గురి చేస్తోందని.. ఈసీ తన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు.

కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు

- 134 సీసీ కెమెరాల ఏర్పాటు
- కౌంటింగ్ కేంద్రాల సమీపంలోనే మీడియా ఫెసిలిటేషన్ సెంటర్
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున
- జిల్లాలో 140 సున్నిత ప్రాంతాలను గుర్తించాం: పోలీస్ కమిషనర్


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున. చిత్రంలో సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. బుధవారం ఢిల్లీ నిర్వచన్ సదన్ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ కుమార్ వ్యాస్ ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాల కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలు, అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ ఎన్ఐసీ వీసీ హాల్ నుంచి కలెక్టర్ మల్లికార్జున, పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కౌంటింగ్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా పరమైన చర్యలు ఇతర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి జిల్లాలో చేపట్టిన చర్యలను, జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టర్ మల్లికార్జున వివరించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల ఫలితాల సమాచారం అందించేందుకు కౌంటింగ్ కేంద్రాల సమీపంలోనే మీడియా ఫెసిలిటేషన్ సెంటర్, పబ్లిక్ కమ్యూనికేషన్ సిస్టమ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు.

మూడంచెల భద్రత ఏర్పాటు

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని, మూడంచెల విధానంలో భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచామని చెప్పారు. కేంద్ర బలగాలతో పాటు సివిల్ పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని 134 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వాటిని మానిటరింగ్ రూమ్‌కు అనుసంధానం చేశామన్నారు.

మూడు రౌండ్లలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు

పార్లమెంటు పరిధిలోని పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియను మూడు రౌండ్లలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అందుకోసం రెండు హాళ్లు గుర్తించామని, 18 టేబుళ్లను కేటాయించామని వివరించారు. 18 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లను, 36 మంది కౌంటింగ్ అసిస్టెంట్లను, మరో 18 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని చెప్పారు. జిల్లాలోని అసెంబ్లీలకు పార్లమెంటుతో కలిపే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అదనంగా పెందుర్తి నియోజకవర్గానికి సంబంధించి మరో మూడు రౌండ్లు పార్లమెంటు పరిధిలో పెరుగుతాయని స్పష్టం చేశారు. అసెంబ్లీల పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 5 హాళ్లలో 33 టేబుళ్లు ఏర్పాటు చేశామని, 15 రౌండ్లలో లెక్కింపు పూర్తి అవుతుందన్నారు. 24 మంది అదనపు ఏఆర్వోలు, 33 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, 57 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 33 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఈ నెల 25న తొలి విడత ర్యాండమైజేషన్ పూర్తయ్యిందని, జూన్ 2వ తేదీన రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామని వివరించారు.

140 రౌండ్లలో కౌంటింగ్

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కౌంటింగ్ నిర్వహణకు సంబంధించి ఏయూ పరిధిలో ఏడు హాళ్లు గుర్తించామని చెప్పారు. నియోజకవర్గానికి రెండేసి చొప్పున మొత్తం 98 టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 140 రౌండ్లలో కౌంటింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. ఒక్కో టేబుల్‌కు ఒక్కో కౌంటింగ్ సూపర్ వైజర్, ఒక్కో కౌంటింగ్ అసిస్టెంట్, ఒక్కో మైక్రో అబ్జర్వర్‌ను నియమించామని తెలిపారు.

పటిష్ట భద్రతా చర్యలు

జిల్లాలో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టామని, కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవి శంకర్ చెప్పారు. జిల్లాలో 140 సున్నిత ప్రాంతాలను గుర్తించామని, అక్కడ పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నామని, ఇప్పటి నుంచే పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. నిత్యం పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. నగర పరిధిలో జరిగే అన్ని సంఘటనలను పర్యవేక్షించేందుకు అనుగుణంగా ఎక్కడిక్కడ సీసీ కెమెరాలు అమర్చామని వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేశామని వివరించారు. ఈ సమావేశంలో విశాఖ తూర్పు ఆర్వో కె.మయూర్ అశోక్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఆర్వో హుస్సేన్ సాహెబ్, గాజువాక ఆర్వో లక్ష్మారెడ్డి, పెందుర్తి ఆర్వో శేష శైలజ, భీమిలి ఆర్వో భాస్కర రెడ్డి, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఆర్వో అఖిల, దక్షిణ నియోజకవర్గ ఆర్వో మూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ

విశాఖ సిటీ: ప్రభుత్వ కార్యాలయాల్లో నియమ నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తూ, అర్హులకు అందాల్సిన ప్రయోజనాలు కల్పించాలని జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ సూచించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయాధికార సంస్థ కార్యాలయంలో జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు న్యాయ శాస్త్ర అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఎటువంటి ప్రయోజనం ఆశించకుండా సామాజిక సేవ చేయాలని చెప్పారు. పని ప్రదేశంలో వేధింపుల నివారణ, బాల్య వివాహాల నిషేదం, మనోవర్తి తదితర చట్టాలను ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ జయదేవి, అనకాపల్లి అదనపు ఎస్పీ పి.ఎస్.ఎన్.రావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.హెచ్.సుబ్బిరెడ్డి, అనకాపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కె.అనంతలక్ష్మి, అనకాపల్లి జిల్లా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వి. జ్యోతి, అనకాపల్లి జిల్లా వికలాంగుల శాఖాధికారి జి.వి.బి.జగదీష్, అదనపు సోషల్ వెల్ఫేర్ అధికారి డి.ఎల్.ఆనందరాజు, అల్లూరి జిల్లా అదనపు చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారిణి పి.అచ్యుతాంబ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డతో సహా సముద్రంలో దూకిన తల్లి

రక్షించిన లైఫ్‌గార్డ్



చంటి బిడ్డతో సహా తల్లిని రక్షించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్ అప్పలరాజు

ఆరిలోవ: చంటి బిడ్డతో సముద్రంలో దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ తల్లిని జీవీఎంసీ లైఫ్‌గార్డ్ రక్షించాడు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై. శ్రీనివాసరావు తెలిపిన వివరాలివీ.. కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా నగరానికి చెందిన ఎస్.దుర్గాభవాని తన పది నెలల చంటి బిడ్డతో బుధవారం జోడుగుళ్లపాలెం బీచ్ వద్ద సముద్రంలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఇది గమనించిన జీవీఎంసీ లైఫ్‌గార్డ్ జి. అప్పలరాజు వెంటనే స్పందించి తల్లీబిడ్డను రక్షించాడు. అనంతరం వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమస్యకు పరిష్కారం ఆత్మహత్య కాదని ఆమెకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కౌంటింగ్ ఏజెంట్లే కీలకం!

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఓట్ల లెక్కింపును జూన్ 4న ఆంధ్ర విశ్వ విద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నారు. ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఏర్పాట్లను దాదాపు పూర్తి చేశారు. కాగా.. కౌంటింగ్ రోజున వివిధ పార్టీల ఏజెంట్ల పాత్ర ఎంతో కీలకం. ఇందుకోసం ఏజెంట్లు నిబంధనలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరముందని పలువురు విశ్లేషకులు సూచిస్తున్నారు. ప్రతీ అంశాన్ని నిశితంగా పరిశీలించాలని కోరుతున్నారు.

- నిబంధనలపై అవగాహన అవసరం
- నిశిత పరిశీలనకు ప్రాధాన్యం
- ఓట్ల లెక్కింపులో అత్యంత అప్రమత్తం

మహారాణిపేట: ఓట్ల లెక్కింపులో ఏజెంట్ల పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. ప్రధానంగా లెక్కింపు సందర్భంగా పాటించాల్సిన నిబంధనలపై ఏజెంట్లకు పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలి. లేదంటే కౌంటింగ్ ప్రక్రియ గందరగోళంగా మారే ప్రమాదం ఉంది. సార్వత్రిక ఎన్నికల లెక్కింపు ప్రక్రియలో ఫారం-17సీ ఎంతో కీలకమైనది. ప్రతి కౌంటింగ్ ఏజెంట్, పరిశీలకులు, సహాయ పరిశీలకులకు దీనిపై అవగాహన ఉండాలి. కంట్రోల్ యూనిట్‌లో నమోదైన మొత్తం ఓట్లు, ఫారం-17 సీలో పొందుపరిచిన మొత్తం ఓట్లు సరిపోల్చి చూసుకోవాలి. పార్లమెంట్, అసెంబ్లీ నియోజక వర్గం నంబర్, పోలింగ్ కేంద్రం పేరు, అక్కడ వినియోగించిన కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్ల గుర్తింపు నంబర్లను ఆ ఫారంలోనే నమోదు చేస్తారు. ఆ పోలింగ్ కేంద్రం పరిధిలోని ఓటర్ల సంఖ్య, ఓటు వేయడానికి వచ్చిన వారి సంఖ్య, పోలింగ్ కేంద్రంలోకి వచ్చాక ఓటు వేయడానికి నిరాకరించి వెళ్లిపోయిన వారి సంఖ్య, ఓటు వేసేందుకు పీవో అనుమతించని వారి సంఖ్య, ఓటింగ్ యంత్రంలో నమోదైన మొత్తం ఓట్ల సంఖ్య ఫారం-17సీలో ఉంటాయి. టెండర్ బ్యాలెట్లు, సరఫరా చేసిన పేపర్ సీళ్లు(పోలింగ్ కేంద్రంలో ఓటరుకు ఇచ్చే రెండు రంగుల స్లిప్‌లు), సీరియల్ నంబర్లు, ఎన్ని పేపర్లు వినియోగించారు, వినియోగించని పేపరు సీళ్లు ఎన్ని తిరిగి రిటర్నింగ్ అధికారికి వెళ్లాయి, పాడైపోయిన పేపర్ సీళ్లు, సీరియల్ నంబర్లు, తదితర అంశాలను ఏజెంట్లు నిశితంగా గుర్తించాల్సి ఉంటుంది.



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్ (ఫైల్)

వరుస క్రమంలో లెక్కింపు : కౌంటింగ్ ఒక రౌండ్ పూర్తయిన వెంటనే అందులోని రెండు కంట్రోల్ యూనిట్లను జనరల్ అబ్జర్వర్ తన టేబుల్ వద్దకు తెప్పించుకుంటారు. అదనపు పరిశీలకులతో ఓట్లు లెక్కిస్తారు. కంట్రోల్ యూనిట్‌లోని ఓట్ల సంఖ్యకు ఫారం-17సీ, పార్టు-2లో కౌంటింగ్ సూపర్‌వైజర్ నమోదు చేసిన ఓట్ల సంఖ్యకు సమానంగా ఉంటే ఇబ్బంది లేదు. ఒకవేళ ఏదైనా తేడా వస్తే పరిశీలకుడు తనిఖీ చేసిన మిగిలిన కంట్రోల్ యూనిట్లన్నింటినీ జనరల్ అబ్జర్వర్ మరోసారి లెక్కిస్తారు. వివరాలు తప్పుగా నమోదు చేసిన కౌంటింగ్ పరిశీలకుడిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. అసాధారణంగా ఇద్దరు అభ్యర్థులకు కౌంటింగ్ ఓట్లు సమానంగా వస్తే ప్రజా ప్రాతినిధ్యం చట్టం ప్రకారం రిటర్నింగ్ అధికారి లాటరీ ద్వారా ఫలితం ప్రకటిస్తారు.

తేడా వస్తే..!

కౌంటింగ్ సమయంలో టేబుల్ వద్దకు కంట్రోల్ యూనిట్‌తో పాటు ఫారం-17సీలోని వివరాలను ఏజెంట్లు తప్పనిసరిగా రాసుకోవాలి. కంట్రోల్ యూనిట్ డిస్‌ప్లే సెక్షన్‌లో చూసిన పోలైన మొత్తం ఓట్లు, ఫారం-17సీలో నమోదు చేసిన ఓట్ల సంఖ్య సమానంగా ఉండాలి. క్లరికల్ తప్పిదం, మరో కారణంతో కానీ కంట్రోల్ యూనిట్ ఫారం-17సీలో ఓట్ల సంఖ్యలో తేడా వస్తే అది వివాదాస్పదంగా మారుతుంది. అలాంటి కంట్రోల్ యూనిట్లను రిటర్నింగ్ అధికారి పక్కన ఉంచి ఎన్నికల కమిషన్‌కు సమాచారం అందిస్తారు. కంట్రోల్ యూనిట్ టేబుల్ పైకి రాగానే ఏజెంట్ల పరిశీలనకు ఉంచుతారు. ఆ కంట్రోల్ యూనిట్ ఏ పోలింగ్ కేంద్రానికి చెందినదో ఏజెంట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుంది.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికలు



పోటీలకు ఎంపికైన బాల, బాలికలు

భీమునిపట్నం: విశాఖ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఇక్కడ వుడా మైదానంలో రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు బాల, బాలికల ఎంపిక పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జట్టుకు 12 మంది చొప్పున రెండు జట్లకు 24 మంది బాల, బాలికలను ఎంపిక చేశారు. ఇందులో ఎంపికైన వారు ఈనెల 31వ తేదీన బీచ్‌రోడ్డులోని తిమ్మాపురంలోని విజ్ఞాన్ విద్యాలయంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.లలిత్‌కుమార్ తెలిపారు.

రూ.10 లక్షల నగదు చోరీ

పని మనిషి పనేనా?

బీచ్‌రోడ్డు: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.10 లక్షలు చోరీకి గురైనట్లు బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివీ.. అజిత్ మింద వృద్ధురాలైన తన తల్లితో కలసి కిర్లంపూడి లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన రెండు రోజుల కిందట పని మీద వేరే ప్రాంతం వెళ్లారు. ఆ సమయంలో తల్లికి తోడుగా పనిమనిషిని పెట్టారు. కాగా.. బుధవారం ఇంటికి వచ్చిన ఆయనకు పని మనిషి కనబడకపోవడంతో అనుమానం వచ్చింది. వెంటనే బీరువా తెరిచి చూడగా.. అందులో ఉంచిన రూ.10 లక్షలు నగదు కనిపించలేదు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

హయ్యర్ పెన్షన్‌పై జూన్ నెలాఖరుకు క్లారిటీ



పీఎఫ్ రీజనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్, రమణమూర్తి

ఉక్కునగరం: హయ్యర్ పెన్షన్ అంశంపై జూన్ నెలాఖరుకు ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉందని పీఎఫ్ రీజనల్ కమిషనర్ విజయకుమార్ ప్రసాద్ తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, స్టీల్‌ప్లాంట్ పీఎఫ్ ట్రస్ట్ మాజీ సభ్యుడు పైడి వెంకట రమణమూర్తి కోరారు. బుధవారం వారు విశాఖలోని రీజనల్ కమిషనర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈపీఎఫ్ ట్రస్ట్ అందజేసిన నోటీసుల మేరకు స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 1,408 మంది ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ కోసం రూ.336 కోట్లు చెల్లించారన్నారు. అయితే వాటికి సంబంధించి ఇప్పటి వరకు ఎవరికీ హయ్యర్ పెన్షన్ చెల్లించలేదన్నారు. దాని వల్ల ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై రీజనల్ కమిషనర్ స్పందిస్తూ హయ్యర్ పెన్షన్ అంశం జూన్ నెలాఖరుకు కేంద్ర పీఎఫ్ కార్యాలయం నుంచి ఒక క్లారిటీ వచ్చే అవకాశం ఉందన్నారు. దాని బట్టి తాము చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

అడ్డాకులకు అదిరే ధర

అడ్డాకులు గిరిజనులకు అధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి. ప్రస్తుతం గిట్టుబాటు ధర ఉండడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కావిడ అడ్డాకుల ధర రూ.2000 వరకు వస్తుండడంతో ఆకుల సేకరణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

- గిరిజనులకు సిరులు కురిపిస్తున్న అడ్డాకుల సేకరణ
- ఈ ఏడాది ముమ్మరంగా సేకరణ, విక్రయాలు
- ధర గిట్టుబాటు కావడంతో హర్షం

సాక్షి,పాడేరు: అడవినే నమ్ముకుని పూర్వం నుంచి జీవిస్తున్న గిరిజనులకు వేసవి కాలం వచ్చిందంటే అడ్డాకులను సేకరించడమే ప్రధాన వ్యాపకం. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో అడవుల్లో విస్తారంగా అడ్డాకులు లభిస్తున్నాయి. దీంతో గత మూడు వారాల నుంచి అడ్డాకులను సేకరిస్తున్న గిరిజనులు వాటిని బాగా ఆరబెట్టి అమ్మకాలు జరుపుతున్నారు. వారికి అదనపు ఆదాయం లభిస్తుండటంతో అడ్డాకుల సేకరణపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

కావిడ అడ్డాకులు రూ.2వేలు

ప్రస్తుతం ఏజెన్సీ వ్యాప్తంగా అడ్డాకుల అమ్మకాలు జోరందుకున్నాయి. మైదాన ప్రాంతాలలో అడ్డాకులకు డిమాండ్ ఉండడంతో వ్యాపారులు పోటాపోటీగానే కొనుగోలు చేస్తున్నారు.సీజన్ ప్రారంభ దశ కావడంతో కావిడ అడ్డాకులను రూ.2వేలతో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.ముందు ధర పెరుగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు చెందిన గిరిజన కుటుంబాలే అధికంగా అడవులలో అడ్డాకులను సేకరిస్తుంటాయి.అడ్డాకుల సీజన్‌లో కనీసం రూ.20వేల వరకు ఆదాయం లభిస్తుంది. ఈ సీజన్‌లో గిరిజనులకు అడ్డాకులు మంచి ఆదాయ వనరుగా మారింది.



హుకుంపేటలో అడ్డాకులను అమ్ముతున్న గిరిజనులు

పలు రాష్ట్రాల్లో డిమాండ్

ఏజెన్సీలో గిరిజనుల వద్ద కొనుగోలు చేసిన అడ్డాకులను తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు,కర్ణాటక,కేరళ రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఏజెన్సీలో అడ్డాకులను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటారు. జిల్లాలో హుకుంపేట, అరకు, గుత్తులపుట్టు,జి.మాడుగుల,అన్నవరం, లోతుగెడ్డ,తాజంగి వారపుసంతలలో ప్రతివారం కనీసం రూ.20 లక్షల వరకు అడ్డాకుల వ్యాపారం జరుగుతుంది. అడ్డాకుల అమ్మకాలతో గిరిజన కుటుంబాలతో పాటు వ్యాపారులకు కూడా మంచి ఆదాయం చేకూరుతుంది.



ఆటోలో అడ్డాకులను మైదాన ప్రాంతానికి తరలిస్తున్న దృశ్యం

భూమాఫియాపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి

బీజేపీ ఏపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్

ఎంవీపీకాలనీ: ఉత్తరాంధ్ర భూమాఫియాపై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టాలని బీజేపీ ఏపీ ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ అన్నారు. లాసన్స్ బే కాలనీలోని బీజేపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రెండు రకాలుగా భూ దోపిడీ జరిగిందన్నారు. విశాఖలో దసపల్లా భూములు, రుషికొండ, మాన్సాస్ ట్రస్ట్ భూములు భూమాఫియాకు గురయ్యాయన్నారు. చివరికి రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కుమారుడి పేరు సైతం ఉత్తరాంధ్ర భూదందాలో వినిపించిందంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో అర్థంచేసుకోవచ్చన్నారు. అర్హతలేని కంపెనీలకు లక్షల ఎకరాలు భూమిని ప్రభుత్వం అప్పనంగా దారబోసిందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కూటమి ప్రభుత్వమేనని వెల్లడించారు.

బాలికల గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు



తాళ్లపాలెంలో మిగులు సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సమన్వయకర్త రూపావతి

కశింకోట: ఉభయ విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని బాలికల గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 108 మిగులు సీట్లను భర్తీ చేశారు. తాళ్లపాలెంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి బుధవారం ఇక్కడ కౌన్సెలింగ్ నిర్వహించారు. తాళ్లపాలెం, కోనాం, కొక్కిరాపల్లి, నక్కపల్లి, నర్సీపట్నం, మధురవాడ, మేఘాద్రిగెడ్డ గురుకులాల్లో ప్రవేశానికిగాను మిగులు సీట్ల భర్తీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయ జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపావతి, ప్రిన్సిపాళ్ల గ్రేస్, మళ్ల మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో 42 డిగ్రీలు

అనకాపల్లి: జిల్లా ప్రజలు అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడిపోతున్నారు. బుధవారం చోడవరంలో 42 డిగ్రీలు, అనకాపల్లిలో 39.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. వర్షాల వల్ల రెండు మూడు రోజులు చల్లబడిన వాతావరణం ఈ నెల 26 నుంచి మళ్లీ వేడెక్కింది. అనకాపల్లిలో ఈ నెల 26న 36.3 డిగ్రీలు, 27న 37.0, 28న 38.0, 29న 39.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచి భానుడు ప్రతాపం చూపడంతో చిన్నారులు, వృద్ధులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యం కారణంగా.. ఆయా స్టేషన్ల నుంచి అంతే ఆలస్యంగా రైళ్లు బయలుదేరుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

- తాంబరం-సంత్రగచ్చి (22842) అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ సుమారు 13 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 8గంటలకు బయలుదేరింది.
- ఎస్ఎంవీటీ బెంగళూరు-అగర్తల (12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు 26 గంటలు ఆలస్యంగా బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరింది.
- సంత్రగచ్చి-సికింద్రాబాద్(07222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 8 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 8గంటలకు బయలుదేరింది.
- హుబ్బళ్లి - నహర్‌లగున్(07387) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా బుధవారం సాయంత్రం 4.05 గంటలకు బయలుదేరింది.
- ఎస్ఎంవీటీ బెంగళూరు-మాల్దా టౌన్ (06565) సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు 8 గంటలు ఆలస్యంగా బుధవారం మధ్య రాత్రి 12.15 గంటలకు బయలుదేరింది.
- ముజఫర్‌పూర్- మైసూరు (06222) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ గంటంపావు ఆలస్యంగా బుధవారం మధ్యాహ్నం 2.15 గంటలకు బయలుదేరింది.
- డిబ్రూఘడ్-న్యూ నాగర్‌కోయిల్ (06104) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా బుధవారం రాత్రి 11.55 గంటలకు బయలుదేరింది.
- గురువారం రాత్రి 11.40 గంటలకు సంత్రగచ్చిలో బయలుదేరాల్సిన సంత్రగచ్చి-తాంబరం (06090) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ సుమారు మూడున్నర గంటలు ఆలస్యంగా శుక్రవారం తెల్లవారు 3.10 గంటలకు బయలుదేరుతుంది.
- గురువారం మధ్యాహ్నం 12.10 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరాల్సిన భువనేశ్వర్-రామేశ్వరం (20896) ఎక్స్‌ప్రెస్ గంట ఆలస్యంగా మధ్యాహ్నం 1.10 గంటలకు బయలుదేరుతుంది.

ఒకటి నుంచి గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశాలు

మధురవాడ: మారికవలస-తిమ్మాపురం రోడ్డులోని సీబీఎస్ఈ గుర్తింపు పొందిన ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఇంగ్లిష్ మీడియం స్కూల్లో జూన్ ఒకటో తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రిన్సిపాల్ శివప్రసాద్ చెప్పారు. ఇక్కడ 5వ తరగతిలో ప్రవేశం కోసం ఉదయం 10 గంటల నుంచి కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇప్పటికే ఎంపికైన విద్యార్థులకు కాల్ లెటర్స్, ఫోన్ ద్వారా సమాచారం అందజేసినట్టు తెలిపారు. అలాగే పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో నోటీసు బోర్డు ద్వారా కూడా తెలియజేశామన్నారు. మరిన్ని వివరాలకు 95029 56307, 94909 57232లో సంప్రదించాలని కోరారు.

సెల్‌ఫోన్ చూడొద్దన్నందుకు బాలిక ఆత్మహత్య

పీఎంపాలెం: అదే పనిగా సెల్‌ఫోన్ చూస్తున్న కుమార్తె(14)ను ఆమె తల్లి మందలించడంతో.. మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 7వ వార్డులోని వాంబేకాలనీలో కె.అన్నపూర్ణ కుటుంబంతో నివసిస్తున్నారు. ఆమె ఇంటి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. మైనర్లు అయిన కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె సెల్‌ఫోన్‌కు బానిస కావడంతో అసహనానికి గురైన తల్లి.. ఆమెను మందలించింది. దీనిని అవమానంగా భావించిన బాలిక మంగళవారం సాయంత్రం ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడింది. కొంతసేపటికి ఇంటికి వచ్చిన అన్నపూర్ణ.. కుమార్తెను చూసి షాక్ గురైంది. స్థానికుల సాయంతో వెంటనే గీతం ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.